లాప్‌టాప్స్ పంపిణీ

లాప్‌టాప్స్ అందిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సచివాలయంలోని నూతన సమావేశపు మందిరంలో సోమవారం విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులశాఖ ద్వారా ఎంపిక చేయబడిన అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా లాప్ టాప్‌లను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి అందజేశారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల అసిస్టెన్స్ కార్పొరేషన్ వారు ఒక్కొక్కటి రూ.36,000లు విలువ గల లాప్‌టాప్‌లను ముగ్గురు విద్యార్థులు వేద, జ్యోష్ణ, ఆమనీలకు కలెక్టర్ అందజేశారు. ట్రైనీకలెక్టర్ హిమ వంశీ, శాఖ ఏడీ వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకటించిన మొదటి బడ్జెట్‌పై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రజాసంక్షేమానికి కేటాయించాల్సిన మేర నిధులు ఆ మేరకు కేటాయింపులు లేకపోవడం దారుణం. ఎన్నికల హామీలను ఎప్పటినుండి అమలు చేస్తారో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేదు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయింది. రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాల గురించి ప్రస్తావనే లేదు.

బడ్జెట్ పూర్తి రాజకీయ పత్రంగా ఉంది. అనేక పేరాల్లో ముఖ్యమంత్రిని కీర్తించడం, అలాగే గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని వర్ణించడానికే సరిపోయింది. ఆదివాసులు, దళితులకు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయం. సబ్‌ప్లాన్‌గా దళితులకు కేవలం 6.28 శాతం, గిరిజనులకు 2.56 శాతం మాత్రమే కేటాయించారు. మహిళా శిశు సంక్షేమ కేటాయింపులు ఇంకా నాసిగా రూ.4,285 కోట్లు మాత్రమే! ఇదీ సమాజంలో సగంగా ఉన్న స్త్రీలకు ఇచ్చిన ప్రాధాన్యత..? మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల ప్రస్తావనే లేదు. ఇక వివిధ పథకాలు వల్లెవేసిన మంత్రి వాటిని బాలబాలికలకు బాలింతలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు హెల్పర్లకు పెండింగ్‌లో ఉన్న వేతన పెంపు హామీల గురించి మాత్రం ప్రస్తావించలేదు. సంక్షేమ పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం గురించి ఘనంగా చెప్పిన ఆర్థిక మంత్రి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో ప్రారంభిస్తామని చెప్పారే తప్ప సుపర్ 6లో భాగమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటివి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకపోవడం ఆయా తరగతులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ఇక పంటల బీమా స్వచ్ఛంద నమోదు అన్న ఆకర్షణీయ మాటల వెనుక ఇప్పటివరకున్న ఉచిత బీమాపై రైతు ప్రీమియం చెల్లిస్తేనే అమలవుతుందన్న విషయాన్ని దాచిపెట్టడం అన్నదాతను మభ్యపుచ్చడమే.. అలాగే మత్స్యకారుల గురించి చాలా చెప్పినా ఇప్పటివరకూ చెల్లించని వేట నిషేధభృతి గురించి ప్రస్తావించకపోవడం వారిని గందరగోళానికి గురి చేస్తోంది. మెగా డిఎస్‌సి ద్వారా 16,347 పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌ను ప్రస్తావించారు. కానీ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి గురించి, జీవో నెం 3 పునరుద్ధరణ గురించి పేర్కొనకపోవడం అన్యాయం.

పట్టణాభివృద్ధికి రూ.11,490 కోట్లు ప్రస్తావించారు. అయితే ఇటీవల కాలంలో తరచు సంభవిస్తున్న తాగునీరు కలుషితం కావడం, ఆకస్మిక భారీ వర్షాలు కారణంగా నీటమునగడం వంటి సంఘటనలను గురించి ప్రస్తావించడం కానీ, పరిష్కార మార్గాలకు చర్యలు గురించి గానీ ప్రస్తావించలేదు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అని చెప్పారు కానీ, నిర్వాసితుల గురించి మాటమాత్రమైనా ప్రస్తావించలేదు. ఎప్పటిలోగా ప్రాజెక్టును పూర్తి చేస్తారన్నదీ స్పష్టంగా చెప్పలేదు. పరిశ్రమలకు, పెట్టుబడులకు గమ్యంగా రాష్ట్రాన్ని మారుస్తామన్నారు. కానీ సంపద సృష్టించే కార్మికుల సంక్షేమం ఊసు లేదు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి బడ్జెట్‌లో ఛార్జీల తగ్గింపు గురించి మాట్లాడకపోవడం విడ్డూరం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్ల నిధులను కేంద్రం నుండి పొందామనిచెప్పి ప్రపంచబ్యాంకు దగ్గర అప్పు అన్న విషయాన్ని దాచి పెట్టింది. మొత్తం మీద బడ్జెట్ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించింది. ఇక ప్రాజెక్టుల విషయానికి వస్తే హంద్రీ-నీవాకు రూ.867.75 కోట్లు, గాలేరు -నగరి లింగ్ కెనాల్‌కు రూ.2.234.08 కోట్లు మాత్రమే కేటాయించింది.

ప్రజల మంచి కోరే బడ్జెట్..

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. రాష్ట్రంలోని మంచి ప్రభుత్వం.. ప్రజలకు మంచి కోరే బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఎన్నికల హామీలను నెరవేర్చే దిశగా అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, ఉన్నత విద్య, వైద్యరంగం, పంచాయతీ రాజ్, పట్టణాభివృద్ధి శాఖ, రవాణా, హౌసింగ్, పరిశ్రమలు, ఇరిగేషన్ శాఖలకు గతంలో కన్నా ఎక్కువ నిధులు కేటాయించారు. సంక్షేమ శాఖలు, నైపుణ్యా అభివృద్ధి సంస్థకు అధిక కేటాయింపులు చేపట్టడం ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించి, విద్యా, ఉపాధి, సంక్షేమ రంగాలను గాడిలో పెట్టే ప్రయత్నం జరిగింది. వ్యవసాయ, విద్యుత్ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు

-వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని చెప్పకతప్పదు. స్కీమ్ వర్కర్ల విషయం ప్రస్తావనే లేదు. ఎన్నికల ముందు సూపర్ 6 పేరుతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో వీటి అమలుకు నిధులు కేటాయించకపోవడం దారుణం. వ్యవసాయం, ప్రాజెక్టులకు కేటాయింపులు తగ్గాయి. విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న ప్రభుత్వం ఆ ప్రస్తావనే లేదు.

విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి

- జివి.రమణ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 9.8శాతం మాత్రమే కేటాయించింది. విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఏమాత్రం సరిపోదు. గత ప్రభుత్వం పాఠశాల విద్యావ్యవస్థను అస్థవ్యస్థం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బాగు చేస్తుందని భావించిన ఉపాధ్యాయులను నిరాశకు గురి చేసేలా బడ్జెట్‌లో విద్యారంగ కేటాయింపులున్నాయి.

ఇవేమి కేటాయింపులు

- సురేంద్రన్, సిపిఐఎంఎల్ నూడెమాక్రసి జిల్లా కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ అత్యంత దారుణంగా ఉంది. విద్యారంగానికి 2,326 కేట్లు ఫిజ్ రియంబర్స్‌మెంట్‌కే సరిపోతుంది. గృహ నిర్మాణానికి కేటాయింపుల రూ.4.092కోట్లు అసంపూర్ణ నిర్మాణాల పూర్తికి సరిపోతుందా పరిశ్రమలకు రూ.3,127కోట్లుతో పరిశ్రమలు పెరిగి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించగలమా కూటమి ప్రభుత్వం ఆలోచించాలి.

పేదలకు అన్యాయమే..

- ఎస్.నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి

రాష్ట్ర బడ్జెట్‌లో పేద,మధ్యతగతికి అన్యాయం చేసేలా ఉంది. వ్యవసాయానికి కేటాయింపులు తగ్గించారు. విద్య, వైద్యం కేటాయింపులు తగ్గాయి. కార్మికుల సంక్షేమం పట్టించుకోలేదు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం చేసిన ప్రచార హామీలకు బడ్జెట్ కేటాయింపులకు ఏమాత్రం పొందలేదు.

ఇంటి వద్దే కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : ఈ నెల 14వ తేదీ నుంచి ఇంటి వద్దే కేన్సర్ నిర్ధారణా పరీక్షలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుంచి జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14 నుండి ప్రతి ఇంటి వద్దే 18 సంవత్సరాలు నిండిన ప్రజలందరికీ అసంక్రమణ వ్యాధులలో బిపి, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్, పక్షవాతం, బ్రెస్ట్ కేన్సర్ మొదలగు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. నిర్ధారణ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే సులభంగా చికిత్స చేయవచ్చుని, ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ మానవతాదృక్పథంతో క్వాలిటీగా స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఈనెల 8, 9 తేదీలలో జిల్లాలోని పిహెచ్‌సి సిబ్బందికి కేన్సర్ స్క్రీనింగ్ పై పూర్తి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 12వ తేదీన నమూనాగా రెండు ఇళ్లను మెడికల్ ఆఫీసర్ స్క్రీనింగ్ చేయాలని, 13వ తేదీ ఆశా కార్యకర్తలు ఇంటింటికి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 14 తేదీ నుంచి వ్యాధుల నిర్ధారణ పరీక్షల నిర్వహణ ప్రారంభం అవుతుందన్నారు. సిహెచ్‌ఓ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు రోజుకి ఐదు ఇండ్లు మాత్రమే స్క్రీనింగ్‌ను క్వాలిటీగా చేయాలని తెలిపారు. కరపత్రాలు, గోడపత్రికల ద్వారా ఇంటింటికి వెళ్ళినప్పుడు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించాలని, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు తెలపాలన్నారు. ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సూపర్వైజర్ స్టాఫ్, మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

నోటరీ, అఫిడవిట్ అవసరం లేదు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సచివాలయం పరిధిలోని నిరుపేద పిల్లల జనన, ధ్రువీకరణ, ఆధార్ సవరణకు సచివాలయం సిబ్బందిని సంప్రదించినప్పుడు వారి నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా సచివాలయం సేవారుసుం నుంచి పొందాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫెరెన్స్ ద్వారా అపార్ జనరేషన్‌పై డీఈఓ, సమగ్ర శిక్ష ఎపిసి, డిఎల్‌డిఓ, డివైఈఓ, ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఈఓలు, మునిసిపల్ కమిషనర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అపార్ (ఆటోమాటిక్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ), ఆధార్ కార్డ్ మంజూరు చేస్తోందని, ఈ కార్డు ద్వారా భవిష్యత్తులో దేశంలో ఎక్కడైనా పోటీ పరీక్షలు రాయడానికి దరఖాస్తు చేసుకోవచ్చునని, ఈ కార్డు పొందేందుకు విద్యార్థి స్కూల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులో వివరాలు ఒకేలా ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 65.35 శాతంగా అపార్ ఐడిలు పూర్తి అయ్యాయని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు అపార్ కార్డ్ మంజూరుకు విద్యాశాఖ, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, ఆధార్ సవరణకు సంబంధించి వచ్చే దరఖాస్తులను వారి లాగిన్‌లో ఎప్పటికప్పుడు క్లియర్ చేసి ఆధార్ సవరణాలను పూర్తి చేయాలన్నారు.

'వర్కర్లను వేధించే అధికారి మాకొద్దు'

ఐసిడిఎస్ పీడీకి సిఐటియు-ఏఐటియుసి వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గతంలో కుప్పం ప్రాజెక్టులో వర్కర్లను మానసికంగా వేధించిన సిడిపిఓ అరుణశ్రీ బైరెడ్డిపల్లికి ప్రాజెక్టు రావడం తమకు ఇబ్బందికరంగా ఉందని సోమవారం చిత్తూరులోని ఐసిడిఎస్ పిడికి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు, అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి బైరెడ్డిపల్లి ప్రాజెక్టు కమిటీలు సంయుక్తంగా వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత అనుభవాలు దృష్టిలో పెట్టుకొని ఆ అధికారిని కార్యాలయంలో పెట్టిన పనిచేయించుకోవాలి తెలిపారు. ఇప్పటికే రకరకాల యాప్‌లతో పని చేయడం ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితిలో మానసికంగా ఇబ్బంది పెట్టే అధికారి తమకొద్దు అని, ఆమెను మార్పు చేయాలని కోరారు.

కొన్ని రోజులు వేచి చూడండి: పీడీ

కలెక్టర్ ఒక అవకాశం ఇచ్చారని, కొన్ని రోజు వేచి చూడాలని, మీరు చెప్పిన సమస్యలని ఆమె దృష్టికి తీసుకువస్తామని, మార్పు రాకపోతే మళ్ళీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని పిడి తెలిపారు. సిఐటియు నాయకులు వాడ గంగరాజు, ఏఐటియుసి నాయకులు దాసరి చంద్ర, రమాదేవి, దామోదరం, అంగన్వాడీ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి షకీలా, ప్రాజెక్టు నాయకులు శ్యామల విజయలక్ష్మి, రాజేశ్వరి, షంసీరున్నీషా పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామీణ ప్రాంతప్రజలకు వైద్యసేవలు చేస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు నాయకులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ అధ్యక్షులు విక్టర్ కలెక్టర్‌కి సమస్యలు వివరిస్తూ 104 సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరిగా నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించి జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, మూడు సంవత్సరాల నుంచి యాజమాన్యం నిర్లక్ష్యంగా ఇవ్వని ఇంక్రిమెంట్లు, అరియర్స్ రూపంలో ఇవ్వాలని కోరారు. అదేవిధంగా వాహనాలు ఫిట్నెస్ ఇన్సూరెన్స్‌లు వెంటనే చేయించాలని, పిఎఫ్, ఈఎస్ఐ యాజమాన్య వాటా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాహనంలో అన్ని రకాల రోగులకు సంబంధించిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం లక్ష్యం నెరవేరాలంటే 104ను ప్రభుత్వమే నిర్వహించి మెరుగైన వైద్యసేవలు అందించాలని దానికి అన్ని రకాలుగా సిబ్బంది కృషి చేస్తామని తెలిపారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

అన్ని సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ స్పందిస్తూ మీ సమస్యలపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని తొందర్లోనే పరిష్కారం అయ్యే దిశగా చర్చలు సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల యూనియన్ నాయకులు బి.గిరి, జ్యోతి, సుమన్, జ్యోతీశ్వర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

పంచాయతీ నిధులు సద్వినియోగం చేసుకోవాలి

రికార్డులు పక్కాగా ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పంచాయతీ నిధులను పారదర్శకంగా సద్వినియోగం చేస్తూ, నిధుల వినియోగానికి సంబంధించి రికార్డులను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపిడిఓలు, ఈఓపిఆర్ డిలను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా ఎంపిడిఓలు, ఈఓపిఆర్‌డిలు, పంచాయతీ సెక్రేటరీలతో పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచి నీటి సరఫరా, పన్నుల వసూళ్ళు, సచివాలయ తనిఖీ, విద్యార్థుల గుర్తింపు కార్డులు (అపార్) మంజూరు సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ సెక్రేటరీలు గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత మంచినీటి సరఫరా, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. పంచాయతీ నిధులను పారదర్శకంగా సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు నిర్దేశించిన షెడ్యూలు మేరకు గ్రామ పంచాయతీలలో పనులు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ జరిగినదీ, లేనిదీ ఈఓపిఆర్‌డిలు, ఎంపిడిఓలు తనిఖీ చేయాలన్నారు. తనిఖీలో భాగంగా క్లోరినేషన్‌కు సంబందించి జియో ట్యాగింగ్ ఫోటోలను సంబంధిత రిజిస్టర్లను పరిశీలించాలని అన్నారు. వాటర్ పైప్ లైన్‌లకు చిన్నపాటి మరమ్మతులు ఉంటే పంచాయతీ నిధులను వెచ్చించి సరిచేయాలన్నారు. గ్రామాలలో ఇంకా వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ఇండ్లను గుర్తించి వాటి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అపార్ విద్యార్థుల గుర్తింపు కార్డుల జారీకి సంబందించి నోటరీ, అఫిడవిట్ అవసరం లేదని పంచాయతీ సెక్రేటరీలు వారి పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఆధార్ అప్డేషన్‌కు సంబందించి ఉన్న కరెక్షన్స్‌ను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

బుక్‌లెట్స్ ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రకృతి వ్యవసాయం, సాగు యాజమాన్య పద్ధతులపై రైతులలో మరింత అవగాహన తీసుకువచ్చేందుకు వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం వారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో వివిధ పంటల్లో పురుగులు, తెగుళ్ల నివారణ, యాజమాన్య బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

'మామిడి'లో సస్యరక్షణ...

మామిడి పంటలో సస్యరక్షణ చర్యలకు సంబందించి ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో ఉద్యానవన శాఖ ద్వారా మామిడి పంటలో సస్యరక్షణ చర్యలకు సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఉద్యాన పంట అయిన మామిడిలో పూత నుంచి కోత వరకు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన పెంచాలని, రైతులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మధుసూధన్, మురళిక్రిష్ణ, డిపిఎం వాసు, జిల్లా ఎపిఎంఐపి అధికారి బాలసుబ్రమణ్యం, ఎల్‌డిఎం హరీష్ పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అడిషనల్ డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి- యాదమరి: ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభంగా నున్న ఎన్‌సిడిసిడి సర్వేకి ముందస్తుగా యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కోడిగుట్ట గ్రామంలో ట్రైల్ సర్వే సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్ పరిశీలించారు. క్షేత్రస్థాయి సర్వేలో ఏదైనా లోటుపాట్లు తలెత్తుతాయేమోనన్న ఉద్దేశంతో ముందస్తుగా కోడిగుట్ట గ్రామంలో సర్వేను ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. డేటా ఆన్లైన్లో అప్డేట్ చేయడంలో ఏదైనా ఇబ్బందులు వస్తాయా సర్వే ఎలా నిర్వహించాలి అనేదానిపై సిబ్బందికి అవగాహన కల్పించడానికి ఈ సర్వేను ప్రారంభించినట్లు చెప్పారు. యాదమరి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరించాల్సిందే..: కలెక్టర్

'పిజిఆర్ఎస్'కు 131 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టి అధికారులు పనిచేయాలన్నారు. ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మొత్తం 131 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 104, పోలీస్ శాఖ 3, డిఎంహెచ్‌ఓ 1, జిల్లా అటవీశాఖ 1, జిల్లా దేవాదాయ శాఖ 2, ఎంఈఓ రామకుప్పం 1, జిల్లా పంచాయత్ 1, నేషనల్ హైవే 1, పంచాయతీరాజ్ (ఇంజినీరింగ్) 1, డిఆర్‌డిఏ 5, డ్వామా 2, మున్సిపల్ కమిషనర్ పుంగనూరు 1, మున్సిపల్ కమిషనర్ నగరి 1, మున్సిపల్ కమిషనర్ చిత్తూరు 2, ఏపిఎస్‌పిడిసిఎల్ 1, డిఎస్ఓ 1, ఎంపిడిఓ చిత్తూరు 2, ఎంపిడిఓ పూతలపట్టు 1. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'దారి సమస్య పరిష్కరించండి'

ప్రజాసమస్యల పరిస్కార వేదికలో గుడిపాల, యాదమరి మండలాలకు చెందిన ప్రజలు, రైతులు వ్యవసాయ పొలాలకు, గ్రామానికి ఉన్న దారి సమస్య పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి జి.విద్యాధరికి అర్జీలను అందజేశారు. గుడిపాల మండలం మండిక్రిష్ణపురం గిరిజన కాలనీకి చెందిన మహిళలు మేఘల, రాణి మాట్లాడుతూ తామకు ఎటువంటి జీవనాధారం లేదని వ్యసాయం చేసుకుని జీవించడానికి సాగుభూమిని మంజూరు చేయాలని కోరారు. జెసి సమస్యను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే యాదమరి మండలం కాశిరాళ్ల పంచాయతీ గాంధీపురం గ్రామానికి వెళ్లే ప్రభుత్వ రహదారిని పక్క గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకుని రోడ్డు సౌకర్యం లేకుండా చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని సురేష్, చరణ్, పవన్ కుమార్, రమేష్, రఘపతి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి యాదమరి తహాశీల్దార్‌కు ఫోన్ చేసి దారిని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

వేగంగా వినతుల పరిష్కారం

కమిషనర్ పి.నరసింహ ప్రసాద్



అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అందిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించాలని, పరిష్కరించదగిన వినతులను వేగంగా పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. గత వారం అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం 2, మెప్మా 2, టిడ్కో 2, ఇంజనీరింగ్ 1 చొప్పున మొత్తం ఏడు ఫిర్యాదులు అందాయి. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకటరామి రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

కడా పీడీ వికాస్ మరమత్

ప్రజల నుంచివినతులు స్వీకరిస్తున్న కడా పీడీ

కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ పరిధిలో ప్రజల నంచి అందిన వినతుల్లోని ప్రతి సమస్యను పరిష్కరించాల్సిందేనని కడా పీడీ వికాస్ మరమత్ తెలిపారు. సోమవారం పట్టణ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుండి సుమారు 40 వినతి పత్రాలు అందినట్లు పీడీ తెలిపారు. వాటన్నింటినీ పరిశీలించి, త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గుడిపాల: మండలంలోని నరహరిపేట ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ ఢిల్లీ బాయ్, హెచ్ఎం ఖాతూంబి మధ్యాహ్న భోజనం పథకాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ప్రకారమే పిల్లలకు భోజనాలు అందించాలన్నారు. అలాగే నాణ్యత విషయంలో రాజీ పడకూడదన్నారు. మధ్యాహ్న భోజనం పథకంపై తల్లిదండ్రుల ద్వారా ఎటువంటి ఫిర్యాదులు తమకు రాకూడదన్నారు. అనంతరం మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణంలోని పరిశుభ్రతను పరిశీలించారు. వీరితో పాటు వైస్ చైర్మన్ సతీష్, కమిటీ సభ్యులు ప్రియా, దేవి, వాసంతి, రాజకుమార్, నాగరాజు, ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి'

సీఎంని కలిసిన యువ నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: నామినేటెడ్ పదవులలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సీఎం చంద్రబాబును కలవడం జరిగిందని కుప్పం 13వ వార్డ్ ప్రధాన కార్యదర్శి భరత్ తెలిపారు. విజయవాడ ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వార్డ్ అభివృద్ధి, స్కిల్ డెవలప్మెంట్, యువతకు ఉద్యోగావకాశాలు వంటి పలు అంశాల గురించి వివరించడంతో పాటు పార్టీ తరపున రాష్ట్రవ్యాప్తంగా ఇస్తున్న నామినేటెడ్ పదవుల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలని కోరినట్లు తెలిపారు.

విజేతలకు సాగర్ రాజు అభినందన

యువతరంగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: యువతరంగ్ 2024లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులను కళాశాల ఉపాధ్యక్షులు సాగర్ రాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ యువతరంగ్‌ను ఘనంగా నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా తమ విశ్వవిద్యాలయ పరిధిలో కళాశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న తమ కళాశాల విద్యార్థులలో బీకాం (సిఏ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్ చరణ్ మిమిక్రీలో, బిసిఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఆదిచరణ్ ఫోటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభను కనబరిచి తృతీయ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్

ప్రజాశక్తి-విజయపురం(నగరి): సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భాను ప్రకాష్ అందించారు. మెరుగైన వైద్యం కోసం ఏడు మంది బాధితులకు రూ.5,72749 సీఎం నిధుల నుంచి మంజూరయ్యాయి. దీనికి సబంధించిన చెక్కును బాధితులకు నగరిలో ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణంలో సోమవారం ఆయన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ స్వామి నాయుడు, ఉమపతి రాజు, బాలాజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం పట్టణం 15వ వార్డు పరిధిలో టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగ కమిటీ సభ్యులు, కోర్ కమిటీ సభ్యులు కన్నన్ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కార్యకర్తల బాగోగులు పట్టించుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని తెలిపారు. కార్యకర్తల సంక్షేమం కొరకు ప్రత్యేక నిధిని సైతం ఏర్పాటు చేసిన ఘనత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కే దక్కుతుందన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలో శంకర్ నేత్రాలయ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు మురళి తెలిపారు. కార్యక్రమంలో 60మంది కంటి పరీక్షలు చేయించుకోగా 37మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు తయన పేర్కొన్నారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టెక్నీషియన్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం తహశీల్దార్‌గా నాగరాజు

ప్రజాశక్తి- కార్వేటినగరం: పాలసముద్రం మండలం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ (పిడిటి)గా పనిచేస్తూ ఆదివారం కార్వేటినగరం తహశీల్దార్‌గా నాగరాజు నియమితులైయ్యారు. కాగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్వేటినగరంలో పనిచేస్తున్న తహశీల్దార్ భగవతి ఐదు నెలలు పాటు సెలవుపై వెళ్లడంతో కలెక్టర్ పిడిటి పాలసముద్రంలో పనిచేస్తున్న కొమ్ము నాగరాజును కార్వేటినగరం తహశీల్దార్‌గా నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను నిష్పక్షపాతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పలువురు ఆయనకు శుభాభినందనలు తెలిపారు.

గ్రావెల్ తవ్వకాలు తక్షణమే ఆపాలి

- అడవిని నేలమట్టం చేస్తున్నారు..
- ఆగ్రహించి నిరసన వ్యక్తం చేసిన యువకులు

ఆర్‌డీవోకి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): మున్సిపల్ పరిధి కీళపట్టు శివారుల్లోని కొండల్లో గ్రావెల్ తవ్వకాలు ఎక్కువగా జరుగుతుండటంతో తమ జీవనాధారమైన అడవి, కొండ నాశనమౌ తోందంటూ స్థానిక యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గ్రావెల్ క్వారీ నిర్వహించే ప్రాంతానికి చేరిన కీళపట్టు, పెరుమాల్‌నగర్, కావేటిపురం, నాగరాజకుప్పం, బీరకుప్పం, కన్నికాపురం, ఓజీకుప్పం, కేజీకుప్పం, నెత్తం కండ్రిగ, వీకేఆర్‌పురంకు చెందిన యువకులు అక్కడ నినాధాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డీవో కార్యాలయానికి చేరుకొని ఆర్‌డీవో వై.భవానీశంకరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా పూర్వీకుల నుంచి మాకు, తరువాతి తరాల వారికి జీవన ఆధారమై వుంచిన అడవిని క్వారీదారులు నేలమట్టం చేస్తున్నారన్నారు. ఇప్పటికే దట్టమైన అడవి ప్రాణాంగలన్నింటిని విషపూరితమైన బాంబులను పెట్టి పేల్చివేశారన్నారు. రెండేళ్ల క్రితం మైనింగ్ కోసం చిత్తూరు జిల్లా అధికారి డీఆర్‌డీవో ప్రజల కోరిక మేరకు నిర్వహించిన సదస్సులో గ్రామ ప్రజలంత మైనింగ్ రద్దుచేయమని దానివల్ల ఊరికి కలిగే నష్టాలు, అనారోగ్య సమస్యలు, ఇబ్బందుల గురించి వివరించా మన్నారు. అయినా క్వారీ యాజమాన్యం రాజకీయ పలుకుబడితో గ్రామ పరిధిలోని ఏకైక అడవిలో మట్టి, గ్రావెల్ అక్రమంగా తవ్వడం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం మొదలు పెట్టారన్నారు. క్వారీ జరుపుతున్న అడవి ప్రాంతం చుట్టు 11 గ్రామాలున్నాయని ఈ గ్రామాల్లో సుమారు 2వేల మంది నివశిస్తున్నారన్నారు. 80శాతం పైగా నిరక్ష్యరాసులు ఈ ప్రాంతంలోనే పాడిరైతులు ఆవులు, గేదలు, మేకలు, గొర్రెలు మేపుతూ జీవిస్తున్నారన్నారు. కొండపై నుంచి నీటి ప్రవాహం లేక చిన్న ఇంకుడు గుంతలు, చెరువు నిండడానికి కూడ అవకాశం లేకుండ పోతోందన్నారు. క్వారీలను ఆపి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్

మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

విలేకరులతో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రజా పాలనలో.. ప్రజల కోరికలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం రామకుప్పంలోని టీడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు తీరని ద్రోహం జరిగిందని గుర్తించిన ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పక్షాన నిలబడి ఎన్నో ఆశలతో ఘనవిజయం చేకూర్చారన్నారు. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ, సాగునీరు ప్రాజెక్టుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి రైతులకు భరోసా ఇచ్చారన్నారు. పట్టణాలు, గ్రామాభివృద్ధికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విరివిగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. విద్య, వైద్య రంగాలకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపొందించారన్నారు. ఎన్ని ఆర్థిక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పయనిస్తుం దన్నారు. కార్యక్రమంలో నాయకులు మునస్వామి, నారాయణ చారి, ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, సీతాపతి, నాగభూషణం, జయశంకర్, కామరాజు నాయక్, వెంకటరామే గౌడ్, మనోహర్, రామకృష్ణప్ప, రామలింగారెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేత

ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: అనారోగ్యంతో బాధపడుతు న్న స్నేహితుడికి తోటి స్నేహితులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని మహర్షి విద్యా మందిర్ పాఠశాలలో 2000-21 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థుల్లో ఒకరు దేశముని అనారోగ్యం పాలైయ్యారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు పుత్తూరు పురందర్ రెడ్డి, గఫూర్, దాము, హేమాద్రిలు తమ వంతు సాయంగా సోమవారం రూ.50వేలు ఆర్థిక సాయాన్ని దేశమునికి అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితునితో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు.

ఆత్మీయ సదస్సును విజయవంతం చేయండి: ఎంఆర్‌పీఎస్

సోమల: విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-సోమల: ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఈ నెల 14న మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున మాదిగలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, నాయకులు మందా రామనాదం, మండల అధ్యక్షులు ప్రభు కుమార్, మండల అధ్యక్షులు ప్రకాష్ మాదిగ, ఎర్రబెల్లి రవికుమార్, సురేంద్ర, వెంకటరామయ్య, సుండుమని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: 14న మదనపల్లి కేంద్రంగా జరుగు మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేద్దామని ఎంఆర్‌పీఎస్ సీనియర్ నేత వెంకటేష్, ఎంఎస్‌పీ నేత రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని గడ్డురులో వారు మాట్లాడుతూ.. మాదిగల సభ విజయవంతం చేయడానికి విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో గోవిందప్ప, జయప్ప, రవి కుమార్, రంగప్ప, వేనప్ప, బాబు, చంద్ర, మహేష్, బానుచందర్, రామప్ప, సీనప్ప, పాల్ గుణ, పీజీ బాబు, నేతాజీ పాల్గొన్నారు.

తొలిబడ్జెట్‌లో బాబు మోసం బయటపడింది

- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి-విజయపురం(నగరి): చంద్రబాబు మహిళలను మరోసారి మోసం చేశారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. తొలి బడ్జెట్ కేటాయింపుపై సోమవారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి 18,000 ఇస్తాం అని వాగ్దానం చేసి బడ్జెట్లో నిధులు ఇవ్వకపోవడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలవగానే ప్రతి నిరుద్యోగ యువతి, యువకులకు నెలకి రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం అని ఒక్క రూపాయి కూడా కేటాయించక పోవడం దగా కాదా అన్నారు. ఎన్నికల్లో గెలవగానే మహిళలకి ఉచిత బస్ పథకం అమలు చేస్తామని ఆ పథకం ఊసే ఎత్తకపోవడం, నిధులు కేటాయించకపోవడం మోసం కాదా అని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకానికి నిధులు సగానికిపైగా కోత పెట్టడం అన్యాయం కాదా అని పేర్కొన్నారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం అని ఈ ఏడాది 2 సిలిండర్లను ఎగనామం పెట్టడం మోసం కాదా అంటూ ధ్వజమెత్తారు. 50ఏళ్లకే మహిళలకు పెన్షన్ ఇస్తాం అన్నారు.. ఏది ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదన్నారు. రైతులకు 20వేలు ఏడాది పెట్టుబడి సహాయం ఇస్తాం అన్నారని అయితే 10వేల కోట్లు ఇవ్వాల్సింది రూ.4500 కోట్లే ఇవ్వడం రైతులను మోసం చేయడం కాదా అంటూ విమర్శించారు. ఎన్నికల్లో ఓట్లేయించుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇంటింటికి ఇచ్చిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కి గ్యారంటీ.. బాండ్లను ఇప్పుడు ఏం చేసుకోవాన్నారు. ఆ చెల్లని బాండ్లపై ఇప్పుడు ప్రజలు చీటింగ్ కేసులు పెట్టాలా అని ప్రశ్నించారు. దీనికి వారు సమాధానం చెబుతారన్నారు.

అడవిపల్లి రిజర్వాయర్ భూ బాధితుల ఆందోళన



ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఆవులపల్లె సీతమ్మ చెరువు వద్ద రిజర్వాయర్ నిర్మించ తలపెట్టి రైతుల వద్ద నుంచి భూములను సేకరించిన విషయానికి సంబంధించి తమకు తెలియకుండా నోటీసులు ఇవ్వకుండా 22ఏ క్రింద భూములను హోల్డ్ చేసి పెట్టారని దీనిపై రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలంటూ ఆవులపల్లె పంచాయతీ పరిధిలోని పలువురు రైతులు సోమల తహశీల్దార్ కార్యాలయానికి సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 911 పైచిలుకు ఎకరాలకు సంబంధించి తాము సాగు చేసుకుంటున్న భూములను ఎలాంటి సమాచారం నోటీసులు లేకుండా స్వాధీనం చేసుకొని రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రయత్నాలు చేశారని 22ఏ క్రింద వాటిని చేర్చి తమకు నష్టపరిహారం కూడా అందకుండా చేశారన్నారు. దీనిపై గత ప్రభుత్వంలో ఏ విధంగా 22ఏ కింద చేర్చారో తెలియజేసే రికార్డులు చూపించాలంటూ పలువురు రైతులు డిమాండ్ చేశారు. అయితే తహశీలార్ అందుబాటులో లేకపోవడంతో డిటి ఇబ్రహీంతో విషయాలన్నీ తెలిపారు. రైతుల సమస్యలపై తహశీల్దార్ బెన్నురాజ్‌ను ఫోన్ ద్వారా ప్రజాశక్తి వివరాలు కోరగా ఆవులపల్లి రైతులకు భూ సమస్యకు సంబంధించి ఇదివరకే వారితో మాట్లాడడం జరిగిందని అయితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశానుసారం చేయవలసిన విధానాలను తెలియజేస్తే దాని ప్రకారం తాము కూడా అనుసరించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న సోమల ఎస్ఐ శివశంకర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నగరి కళాశాల విద్యార్థులు

విజయం కళాశాల విద్యార్థులు..

విద్యార్థులను అభినందిస్తున్న తేజో మూర్తి

ప్రజాశక్తి-విజయపురం(నగరి): ఎస్వీయూలో జరిగిన అంతర కళాశాలల యువజనోత్సవాల (యువతరంగ్ 2024)లో వివిధ సాంస్కృతిక విభాగాలలో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. జానపద నృత్యం, క్విజ్, వక్తృత్వం, కార్టూనింగ్, రంగోలి పోటీలలో పాల్గొన్నారు. తృతీయ సంవత్సరం బిజెడ్‌సి విద్యార్థిని యామిని రంగోలిలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రముఖులు ఘనంగా సత్కరించారు. కాగా సోమవారం ప్రతిభ కనబరచి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులను కళాశాలలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర రాజు, డాక్టర్ అరుణకుమారి, రామాంజులు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ప్రజాశక్తి-చిత్తూరు టౌన్: ఎస్వీయూలో జరిగిన ఇంటర్ కాలేజీ యూత్ ఫెస్టివల్‌లో విద్యార్థులు అత్యధిక బహుమతులు సాధించడం ద్వారా విద్యా సంస్థకు మరోసారి గుర్తింపు లభించిందని విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం తేజోమూర్తి తెలిపారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు విశ్వవిద్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో విజయం కళాశాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక, సాహిత్య, కళాత్మక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారని ఆయన తెలిపారు. బహుమతులు పొందిన విద్యార్థులను ఆయన సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

పలమనేరులో ట్రాఫిక్ చిక్కులు

ఎక్కడికక్కడ ఆగిపోయిన వాహనాలు

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని వివిధ చోట్ల ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదని పట్టణ వాసులు చెబుతున్నారు. ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివే యడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతు న్నారు. పట్టించుకోవాల్సిన పోలీసులు అటువైపు చూడటం లేదని విస్తుపోతున్నారు. సోమవారం కార్తీక సోమవారం కావడంతో గంగమ్మ ఆలయ వీధిలోని శివాలయం వద్ద ట్రాఫిక్ రద్దీ అధికంగా కనిపించింది. పైగా అదే ప్రాంతంలో సంత నిర్వహిస్తుడడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. గంటల తరబడి ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఆఫీసులు, పాఠశాలలు, కళాశాలలు, ఇతర పనులపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పట్టించుకోవాల్సిన పోలీసులు అటువైపు చూడకపోవడం గమనార్హం. ఇకనైనా పట్టణంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు

సభా భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో, పలువురు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం 1988-89 ఎస్ఎస్‌సి బ్యాచ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ తరపున కార్వేటినగరంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో దాదాపుగా 3లక్షల 30 వేల రూపాయలతో సభ భవనం నిర్మాణం చేపట్టడం జరిగింది. సోమవారం ఈ కార్యక్రమాన్ని ఎంఈవో విజయ్ కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 1988-89లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సభ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గాయత్రి, రిటైర్డ్ హెచ్ఎం విజయ్ కుమార్ పిళ్ళే, ఉపాధ్యాయుని బృందం, పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల మోసాలపై ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-చిత్తూరు టౌన్: చిత్తూరు నగర పరిధిలోని దుకాణాలపై లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇన్స్పెక్టర్ దివ్య ఆధ్వర్యంలో తూనికలు కొలతలు మోసాలకు పాల్పడుతున్న 30దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మోసాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. ఇందులో ఎడిబుల్ ఆయిల్ పైన 1, ఫిష్ మార్కెట్ 5, చికెన్ షాపులు 4, కిరాణా, ఫ్యాన్సీ షాపులపై 7, బియ్యం వర్తకులపై 8, హార్డ్వేర్ షాపులపై 3, ఎలక్ట్రీషన్ షాపులు పైన 2, కేసులు నమోదు చేసినట్టు ఈ సందర్భంగా సీఐ దివ్య తెలిపారు. చిత్తూరు పరిధిలో వినియోగదారులు తూనికలు కొలతల్లో మోసాలను గుర్తిస్తే లీగల్ మెట్రాలజీ శాఖకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. 9398158259 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఇన్స్పెక్టర్ దివ్య విజ్ఞప్తి చేశారు.

ముందస్తు ఎన్‌సిడి సర్వే

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-సోమల: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న ఎన్‌సిడి ముందస్తు సర్వేను పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి సిబ్బంది ఆధ్వర్యంలో పెద్ద ఉప్పరపల్లిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బాలాజీ మాట్లాడుతూ కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి ఏఏ వ్యాధులు ఉన్నాయి ఏ స్థాయిలో ఉన్నాయి వారిని అడిగి తెలుసుకుని బిపి, షుగర్, బరువు ఎత్తు లెప్రసీ క్యాన్సర్ తదితర జబ్బుల గురించి పరీక్షలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వైద్య సిబ్బందికి అవగాహన కోసం ముందస్తు సర్వే చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంతోనే ప్రజల ఆరోగ్యానికి రక్షణ

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రజా ఆరోగ్యమే ధ్యేయంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని సర్పంచ్ నేత్రావతి నాగిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి జయశంకర్ పేర్కొన్నారు. సోమవారం ఉన్సిగానిపల్లి పంచాయతీలో సంపూర్ణ పారిశుధ్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని వీధుల్లో, నివాస గృహాల పరిసరాలు పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు చికిత్సలు అందించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడిపి పంచాయతీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, నేతలు మహేంద్ర నాయుడు, శంకరచలం, గుర్రప్ప, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: పరిసరాలు పరిశుభ్రంతోనే ఆరోగ్యవంతమైన సమాజం మనందరితోనే సాధ్యమని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్ద కాల్వలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ఆరోగ్యం, ప్రశాంతత, సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏకాంబరం, పంచాయతీ కార్యదర్శులు మురళి, కుమార్, శివయ్య, చంద్ర, కిరణ్ కుమార్, చిట్టెమ్మ, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతంలో నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు రామకుప్పం ఎస్ఐ వెంకట మోహన్ తెలిపారు. టేకుమాను తాండా ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 100లీటర్ల సారా ఊటను ధ్వంసం చేయటంతో పాటు, సారా తయారీకి వినియోగించే డ్రమ్ములను ధ్వంసం చేశారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకట మోహన్ ఈ సందర్భంగా అక్రమార్కులను హెచ్చరించారు.రి

కుప్పంలో వరుస చోరీలు

సిసి కెమెరాలలో రికార్డు అయిన దొంగలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పంలో వరుస చోరీలుతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కుప్పం పట్టణ పరిధిలోని కమతమూరు రోడ్డులో గత కొద్ది రోజులకు ముందు ఓ ఇంట్లో నలుగురు దొంగలు చోరీకి ప్రయత్నించిన ఘటన సీసీ కెమెరాలు రికార్డు అయింది. నలుగురు దొంగలు ముఖాలకు మాస్కులు, చేతికి బ్లౌజులు వేసుకొని దొంగతనానికి పాల్పడినట్టు సిసి కెమెరాల ద్వారా తెలిసింది. ఈ ఘటన సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుంది. ఈ వీడియోలు చూసిన ప్రజలు దొంగతనాల నివారణకు పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

పాల వ్యాను, బైక్ ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: పాలవ్యాను బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మాంబేడు పంచాయతీ ధర్మా చెరువు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గోవిందవారిపల్లి నుంచి పాలవ్యానులో వస్తున్నాడు. అదే సమయంలో కొమరగుంట గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి (38) తిరుపతికి వెళుతున్నాడు. ఆ గ్రామం మలుపు వద్ద ఎదురు ఎదురుగా రెండు వాహనాలు ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న సురేష్ రెడ్డికి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించారు. తిరుపతి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సీఎంసికి తరలించినట్లు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలంలో పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వ్యక్తికి భార్యా పిల్లలు ఉన్నారు.

అంతర్రాష్ట్ర ఎర్రదొంగలు అరెస్ట్

ప్రజాశక్తి-పలమనేరు: అంతర్రాష్ట్ర ఎర్రచందనం దొంగలను పలమనేరు పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 21న పలమనేరు రూరల్ మండలం కాల్వపల్లి సమీపంలో రూ.15లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం విధితమే.. కాగా ఈ కేసులో నిందితులను పోలీసులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం 9మందిని అరెస్ట్ చేశారు. సోమవారం డీఎస్పీ ప్రభాకర్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. అరెస్ట్ చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని మూడు అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీ ఉన్న హెల్పర్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ వినతశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కలిజవేడు అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీలకు), కోటాగరం అంగన్వాడీ హెల్పర్ పోస్ట్ (ఎస్సీలకు), తిరువీధి కుప్పం అంగన్వాడి హెల్పర్ పోస్ట్ (ఓసీలకు) కేటాయించారని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని గాండ్లపల్లి, పాపిపల్లి గ్రామాల్లో ఓపెన్ కేటగిరీలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తెలిపారు.

విజయపురం(నగరి): నగరి ఐసీడీఎస్ పరిధిలోని నగరి రూరల్ మండలం, నింద్ర మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కె.కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి మండలం గుండ్రాజుకుప్పం దళితవాడ 1(ఎస్సీ) బుగ్గఅగ్రహారం సహాయకురాలు 1 (ఓసీ), నింద్ర మండలంలో కీళంబాకం దళితవాడ మినీ కార్యకర్త 1(ఓసీ), శ్రీరామపురం ఎస్టీ కాలనీ మినీ కార్యకర్త 1(ఎస్టీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా మైనారిటీ సంక్షేమ దినోత్సవం

చిత్తూరులో

సోమలలో

విజయపురంలో

కుప్పంలో

బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి-చిత్తూరు టౌన్: చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మైనారిటీల సంక్షేమ దినోత్సవాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమ ప్రభుత్వం నడుస్తోందని ముస్లిం మైనారిటీలను అన్ని రంగాల్లో ప్రభుత్వం అభివృద్ధికి కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ రాజనరసింహులు తెలిపారు. మాజీ మేయర్ కటారి హేమలత మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం రానున్న రోజుల్లో ప్రభుత్వం అనేక రకాల మంచి పథకాలను తీసుకొస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఎప్పుడు ముందుంటుందని జిల్లా శాఖ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జీజేయం చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవ నాయుడు పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ విద్యార్థులు, మైనార్టీ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం టౌన్: పట్టణంలోని సామగుట్టపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో, ద్రావిడ విశ్వవిద్యాలయంలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు.

బంగారుపాళ్యం: మౌలానా అబుల్ కలం ఆజాద్ ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గిరిబాబు, రేవతి, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, హసీనా తదితరులు పాల్గొన్నారు.

సోమల: సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపక బృందం విద్యార్థులు జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం(నగరి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని "నేషనల్ ఎడ్యుకేషన్ డే"ని నగరి ప్రభుత్వ కాళాశాలలో నిర్వహించారు. ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ ఇన్ఛార్జ్ డాక్టర్ ఎం రేవతి కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్, విద్యార్థులు, సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందిస్తూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశ విద్యావ్యవస్థను సంస్కరించడంలో మౌలానా ఆజాద్ ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం భాస్కరరాజు, డాక్టర్ మహేశ్వరి, స్టాటిస్టిక్స్ లెక్చరర్, అకడమిక్ కోఆర్డినేటర్, డాక్టర్ పంకజ, ఇంగ్లీషు లెక్చరర్ అరుణ కుమారి, రామాంజులు, డాక్టర్ భాస్కర్, ఉమా మహేశ్వరి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరియుకొని విజయపురం మండలం, ఇల్లతూరు ప్రాథమితో కొన్నత పాఠశాలలోని 52 మంది విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య, విశ్రాంతి టీచర్ దొరస్వామి నోటు పుస్తకాలు, పెన్ను, పెన్సిళ్ళు, క్రీయాన్సా మొదలు విద్యాభ్యసన సామగ్రిని వితరణగా అందజేసారు. ఈ కార్యక్రమలో హెచ్ఎం మాగౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్షత్ర వనంలో లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల శివారులోని వల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి ఆలయ ప్రాంగణంలోని నక్షత్ర వనంలో లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. రెండవ కార్తీక సోమవారం కావడంతో భక్తాదులు విశేషంగా తరలివచ్చి నక్షత్రవనంలో పిండి, నైవేద్యాలతో ద్వీపాలు వెలిగించి శివనామ స్మరణలతో మార్మోగించారు. నక్షత్ర వనంలోని అన్నపూర్ణాంబ, కాశీ విశ్వేశ్వర స్వామికి వేద పండితులు మంత్రోచ్చారణతో విశేష పూజలు చేసి భక్తాదులకు దర్శన ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న, ప్రసాదాలు అందించారు.

పూతలపట్టు: మండల కేంద్రంలోని భీమేశ్వరాలయం సోమవారం భక్తులతో కళకళలాడింది. కార్తీక సోమవారాల్లో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున ఆలయం చుట్టూ దీపారాధనలు చేశారు. దీనికి తోడు నాగుల చవితికి అనువైన సోమవారం కావడంతో ఆలయం భక్తులతో రద్దీగా నిండుకుంది. ఇందులో భాగంగా స్వామి వారు ప్రత్యేక పుష్పాలంకరణలో ప్రజలకు దర్శనమిచ్చారు.

ఏఐఎస్ఎఫ్ నగరి నియోజకవర్గ కమిటీ ఎన్నిక

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలి
- చిత్తూరు జిల్లా కన్వీనర్ బి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-విజయపురం(నగరి): అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ నగరి నియోజకవర్గం కమిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలకు విజయనగరం వేదిక కానుందని తెలిపారు. విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. యువగలం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చినటువంటి హామీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జాతీయ నూతన విద్యా విధానం వల్ల ఇప్పటికే రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు మూతబడడం కూడా జరిగిందని తక్షణమే జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు అధ్యక్ష కార్యదర్శులు పాండ్యన్, షారూక్, ఉపాధ్యక్షులుగా దిలీప్, లక్ష్మి ప్రసాద్, జానకిరామ్ సహాయ కర్యదర్శులు విఘ్నేష్, విష్ణుసాయి, విష్ణు, కోశాధికారిగా జ్యోతిరాం, కార్యవర్గ సభ్యులు ఆదిత్య, మహేష్, సాయికుమార్, నితిన్, చంద్ర, ప్రిత్వి, మహిళా కన్వీనర్లు మేనక, ఉమ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి: సిఐ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోలో మనుషుల్ని ఎక్కించరాదని సూచించారు. ఆటోలకు పర్మిట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లో కలిగి ఉండాలన్నారు. ఎక్కడంటే అక్కడ ఆపి ట్రాఫిక్ రద్దీకి కలిగించే వాళ్లను కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

26న ప్రజా వ్యతిరేక విధానాలపై

దేశవ్యాప్త ఆందోళన

ప్రజాశక్తి-విజయపురం(నగరి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా 26న ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటియుసి నగరి నాయకులు వి వేలన్, షబ్బీర్ బాషా తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికులు, ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కోటీశ్వరులు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య, మధ్య తరగతి ప్రజలను రైతులను కార్మికులను సమస్యలను పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఈ నెల 26న దేశవ్యాప్త ఆందోళన చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసి నగరి నాయకులు రాజేంద్రన్, ఇంద్ర, భాస్కర్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడికి రాని పిల్లలతో పలకరింపు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం నసీబ్ జాన్ విద్యార్థులు స్కూలుకి పదేపదే గైర్హాజరవుతున్నట్లు పరిశీలించారు. తన సిబ్బందితో కలిసి సోమవారం చీలంపల్లి గ్రామానికి చేరుకొని పాఠశాల విద్యార్థులు గణేష్, గగన్, సాయి, సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. క్రమం తప్పకుండా పిల్లలను బడికి పంపించాలని సూచించారు.

జేఏసీ నేతలు హర్షం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సమగ్ర శిక్ష (సర్వ శిక్ష అభియాన్)లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ కలిసి గత సంవత్సరం డిసెంబర్ నెలలో జీతాలు పెంపు ఉద్యోగ భద్రత రెగ్యులరైజేషన్ మొదలగు డిమాండ్లతో సమ్మె చేశారు. ఆ సమ్మె కాలపు జీతాలు గత ప్రభుత్వం ఇవ్వనందుకు పై విషయంపై విద్యాశాఖ మంత్రి సంప్రదించి సమ్మె కాలపు జీతాలు విడుదల చేయాలని కోరారు. మంత్రి వెంటనే స్పందించి సమ్మె కాలపు జీతాలు విడుదలకు కాపీని సోమవారం విడుదల చేయడంపై చిత్తూరు జిల్లా సమగ్ర శిక్ష జేఏసి హర్షం తెలియజేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, అన్ని ఉపాధ్యాయ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి విల్వానాదం, జేఏసీ జిల్లా చైర్మన్ కృష్ణమూర్తి, జేఏసీ నాయకులు సతీష్ బాబు, ఢిల్లీ కుమార్, దేవరాజులు, అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు.